

దేవరగట్టు.. రణరంగం..!

- ఉత్కంఠగా సాగిన బన్ని కర్రల సమరం
- 80 మందికి గాయాలు
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- నేడు మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం

ఆలూరు/హొళగుంద, అక్టోబరు 13: దేవరగట్టు ఉత్సవాలు రణరంగాన్ని తలపించాయి. ఉత్సవమూర్తులను దక్కించుకునేందుకు జరిగిన కర్రల సమరంలో మరోసారి భక్తుల తలలు పగిలాయి. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం అర్ధరాత్రి మాళమల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం 12 గంటలకు ఉత్సవ మూర్తులను దక్కించుకునేందుకు వేలాది మంది భక్తులు పోటీ పడ్డారు. ఈ కర్రల సమరంలో 80 మందికిపైగా గాయాలయ్యాయి. మరికొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. కాగడాల నిప్పు రవ్వలు పడి మరికొందరు గాయపడ్డారు. వారిని ఆదోని, ఆలూరు ప్రభుత్వాసుపత్రులకు తరలించారు.

- వివరాలు 7లో...







తెప్పపై ఆదిదంపతుల విహారం

అమ్మవారి నిజ రూప దర్శనం



స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం

శ్రీశైలం, అక్టోబరు 13: దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం చివరి రోజు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అమ్మవారు భ్రమరాంబదేవి నిజరూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు నందివాహనసేవను అశేష భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవం నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజు ఉదయం అమ్మవారి యాగశాలలో చండీయాగ పూర్ణాహుతి, స్వామివారి యాగశాలలో రుద్రయాగపూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు.

నిజ రూపాలంకరణలో దర్శనం, అమ్మవారికి నందివాహన సేవ

దసరా ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శనివారం అమ్మవారిని నవదుర్గా అలంకరణలలో ఒకటైన భ్రమరాంబాదేవి నిజరూపాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు, ఆలయ అధికారులు, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శమీపూజ : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఉన్న శమీ వృక్షానికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. నందివాహనంపై ఆసీనులైన స్వామి, అమ్మవార్లను శమీ వృక్షం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.



స్వామి, అమ్మవార్లకు నందివాహనసేవ



శ్రీచక్రస్నానం చేయిస్తున్న పురోహితులు



లిక్కర్ లక్ ఎవరికో...!

కర్నూలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి), కర్నూలు(అర్బన్):

మద్యం దుకాణాలకు లాటరీ నేడే. షాపులు దక్కించుకునే 'లక్కు' ఎవరిదో..? దరఖాస్తుదారుల్లో టెన్షన్. జడ్పీ సమావేశం హాల్‌లో సోమవారం లాటరీకి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియకు శ్రీకారం చుడతారు. మూడంచెల విధానంలో డిప్ హాల్‌లోకి దరఖాస్తుదారులకు అనుమతి ఇస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ సుధీర్‌బాబు తెలిపారు. జిల్లాలో 99 షాపులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తే.. రాయలసీమ జిల్లాల్లోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో 3,046 మంది దరఖాస్తు చేశారు. రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచింది. దరఖాస్తు రుసుం రూపంలో రూ.60.92 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరింది.

కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, కోసిగి, ఆదోని, పత్తికొండ, ఆలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 99 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ప్రభుత్వమే నిర్వహించేది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పాత ఎక్సైజ్ విధానంలో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగించే నూతన మద్యం పాలసీని ప్రవేశ పెట్టింది. రెండేళ్ల లీజుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల ఒకటో తారీఖు నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టి 11 తేది వరకు స్వీకరించారు. 5 వేల నుంచి 10 వేలు జనాభా కలిగిన ప్రాంతాల్లో మద్యం షాపునకు తొలి ఏడాది రూ.55 లక్షలు, రెండవ ఏడాది రూ.60.50 లక్షలు, 11 వేలు ఆపై జనాభా ఉన్న పట్టణాలు, మండల కేంద్రాల్లో షాపులకు తొలి ఏడాది రూ.65 లక్షలు, రెండో ఏడాది రూ.71.50 లక్షలు లీజు (రెంటల్) నిర్ణయించారు. మద్యం దుకాణాలపై ఎమ్మెల్యేలు, కీలక రాజకీయ నాయకులు కన్నేసి.. తమవాళ్లకే దక్కించుకునే రాజకీయ కుట్రకు తెరతీశారు. కొందరు ఎక్సైజ్ సీఐలు సైతం దరఖాస్తుల కోసం స్టేషన్‌కు వెళితే.. ఎమ్మెల్యేతో మాట్లాడారా..? చెప్పకుండా దరఖాస్తు చేస్తే.. లాటరీలో షాపు వచ్చినా వ్యాపారం చేయగలవా..? వంటి ప్రశ్నలతో భయపెట్టారు. దీనిపై 'ఎమ్మెల్యే సారుతో చెప్పారా..?' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. అదే క్రమంలో ధైర్యంగా దరఖాస్తు చేయండి.. అండగా మేమున్నామంటూ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సుధీర్‌బాబు భరోసా ఇచ్చారు. సీఎంవో ఆఫీసు నుంచి కూడా ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులకు చివాట్లు తప్పలేదు. దీంతో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇదిలా ఉండగా జడ్పీ కార్యాలయంలో జరిగే లక్కీ డిప్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 158 మందితో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు.

నేడే డిప్..

జడ్పీ సమావేశం హాల్‌లో కలెక్టరు పి. రంజిత్‌బాషా పర్యవేక్షణలో లాటరీ ప్రక్రియ నిర్వహిస్తారు. దరఖాస్తు దారులు మొదట ఆన్‌లైన్‌లో ఎంట్రీపాస్ తీసుకోవాలి. ఈ పాస్ ఉన్నవారినే మాత్రమే ప్రధాన గేటు నుంచి వెయిటింగ్ హాల్‌కు పంపుతారు. అక్కడ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం షాపు వారిగా దరఖాస్తుదారులకు టోకన్లు ఇస్తారు. ఆ టోకన్లు ఉన్న వారినే లాటరీ తీసే హాల్‌లోకి అనుమతి ఇస్తారు.

2017తో పోలిస్తే కర్నూలు, ఆదోని, కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో భారీగా పెరిగాయి. ఎమ్మిగనూరు పరిధిలో కేవలం 4 దరఖాస్తులు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఆలూరు, కోసిగి (మంత్రాలయం నియోజకవర్గం), పత్తికొండ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గతంలో పోలిస్తే దరఖాస్తులు తగ్గాయి. ఇక్కడ ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు, తెరవెనుక చక్రం తిప్పడం వల్లే దరఖాస్తులు తగ్గాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారుల పాత్ర కూడా ఉందనే ఆరోపణలు లేకపోలేదు.

- నేడే మద్యం దుకాణాలకు లాటరీ..
- 99 షాపులు.. 3,046 దరఖాస్తులు
- ఖజానాకు రూ.60.92 కోట్ల ఆదాయం
- జడ్పీ సమావేశం హాల్‌లో ఉదయం 8 గంటలకు ప్రారంభం
- మొదట కర్నూలు షాప్-01కు.. ఆఖరున మద్దికెర షాప్-99కు డిప్
- కలెక్టరు పి.రంజిత్‌బాషా సమక్షంలో లాటరీ

జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్ల వారిగా వచ్చిన దరఖాస్తులు

ఎక్సైజ్ స్టేషన్	షాపులు	దరఖాస్తులు	శాతం
కర్నూలు	31	1,449	46.74
కోడుమూరు	14	510	36.42
ఎమ్మిగనూరు	15	296	19.73
కోసిగి	4	53	13.25
పత్తికొండ	14	303	21.64
ఆదోని	12	247	20.58
ఆలూరు	9	188	20.88
మొత్తం	99	3,046	30.77



లక్కీ డిప్ నిర్వహణకు జడ్పీ కార్యాలయంలో ఏర్పాట్లు



పక్కా ఏర్పాట్లు చేశాం

దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకే జడ్పీ సమావేశం హాల్‌కు చేరుకోవాలి. దరఖాస్తుదారులు ఆర్1 రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఏ3 (బీ) అప్లికేషన్ ఫాం, ఇ1 ఎంట్రీపాస్ తప్పక తమతో పాటు తీసుకురావాలి. లాటరీకి అన్ని ఏర్పాట్లు పక్కా చేశాం.

- సుధీర్‌బాబు, సూపరింటెండెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, కర్నూలు



జిల్లా పరిషత్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్



సంకల్‌బాగ్‌లో విగ్రహాల నిమజ్జనం

గంగ ఒడికి దుర్గమ్మ

వైభవంగా సాగిన విగ్రహాల నిమజ్జనం

కర్నూలు (కల్చరల్), అక్టోబరు 13: దసరా మహోత్సవంలో భాగంగా 9 రోజుల పాటు పూజలందుకున్న దుర్గమ్మ గంగ ఒడికి చేరింది. ఆదివారం కర్నూలు నగరంలో దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. యువకులు డీజే శబ్దాలకు నృత్యాలు చేస్తూ కోలాహలం చేశారు. అనంతరం తుంగభద్ర నదితీరంలో అమ్మవారి విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు. ఈ వేడుకను తిలకించేందుకు విచ్చేసిన వేలాది భక్తులతో నగరంలోని సంకల్‌బాగ్‌లో గల తుంగభద్ర నది తీరం కిక్కిరిసిపోయింది. వేద పండితులు శాస్త్రోక్తంగా దుర్గామాత విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన ఉత్సవ వేడుకలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్తున్న మంత్రి భరత్



దుర్గామాత శోభాయాత్ర

అప్రమత్తంగా ఉండాలి

- 16 వరకు భారీ వర్ష సూచన
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు(కలెక్టరేట్), అక్టోబరు 13: జిల్లాలో 16వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా విజ్ఞప్తి చేశారు. ఆదివారం భారీ వర్షాల సూచన నేపథ్యంలో కలెక్టర్ సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు తదితరులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా 16వ తేదీ వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఏ సమస్య ఉన్నా 08518-277305 నెంబరును ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అల్పపీడనంతో రైతులు జాగ్రత్త పడాలి : జేడీ

కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 13: బంగాళాఖాతంలో అల్పపీడనంతో భారీ వర్షాలు కురుస్తాయని, రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు. వేరుశనగ, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు భారీ వర్షాలకు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పొలాల్లో నీరు నిలబడకుండా ఉండేందుకు వెంటనే బయటకు పంపాలని అన్నారు. పప్పుశనగను వర్షాలు తగ్గిన తర్వాత విత్తుకుంటే మంచిదని అన్నారు.

రక్తం చిందిన దేవరగట్టు



ఆలూరు/హొళగుంద/కర్నూలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి 12.45 గంటలు.. డిర్ర్‌ర్ర్ గోపరాక్ (బహుపరాక్) అంటూ వేలాదిగా భక్తగణం దేవరగట్టుపైకి చేరుకుంది. తలకు పాగచుట్టి.. చేతిలో కర్రపట్టి యుద్ధానికి సిద్ధమైన సైనికుల్లా దేవుడి కార్యంలో నిమగ్నమయ్యారు. శుభముహూర్తం అర్ధరాత్రి ఒంటి గంటకు వేదపండితులు రవి శర్మ మాళ మల్లేశ్వరస్వాముల కల్యాణోత్సవం నిర్వహించారు. జైత్రయాత్రకు సై అంటూ ఉత్సవమూర్తులతో కొండ దిగి సింహాసన కట్టవద్దకు చేరుకోగా.. దేవుడి దక్కించుకోవడానికి అప్పటికే అక్కడికి చేరుకున్న పలు గ్రామాల భక్తులు కర్రలతో మేము సైతం అంటూ కదనరంగంలోకి దిగడంతో.. బన్ని ఉత్సవం (కర్రల సమరం) మొదలైంది. 800 అడుగుల పైభాగాన ఉన్న దేవరగట్టుపై దాదాపు అరగంట పాటు బన్ని ఉత్సవం జరిగింది. ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం దేవరగట్టు వేదికగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జరిగిన ఉత్సవాన్ని కళ్లార వీక్షించాలని రాష్ట్ర నలమూలల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు.

కాళరాత్రి.. కాగడాల వెలుగుల్లో..

నెరిణికి, నెరిణికి తండా, కొత్తపేట గ్రామాల భక్తులు ఉత్సవమూర్తులను పల్లకిలో కొండపై నుంచి దిగువన సింహాసన కట్టపైకి చేర్చి మహా మంగళహారతి ఇచ్చారు. పల్లకి భక్తులు భుజంపై మోసుకోగా.. ఆ పల్లకి రక్షకులుగా కర్రలతో పైగ్రామాల భక్తులు పల్లకి చుట్టూ చేరారు. ఎలాగైనా దేవుడిని తమవశం చేసుకోవాలని అరికెర, అరికెరతండా, కురుకుంద, బిలేహాల్, సుళవాయి, ఎల్లార్తి, విరుపాపురం గ్రామాల భక్తులు కర్రలు, కాగడాలతో అడ్డుకున్నారు. అప్పుడు సమయం అర్ధరాత్రి 1.20 గంటలు. దేవుడిని కాపాడుకోవడం కోసం పైమూడు గ్రామాల భక్తులు, తమవశం చేసుకోవాలని మిగిలిన గ్రామాల భక్తగణం డిర్ర్‌ర్ర్ గోపరాక్ అంటూ సమరానికి సై అంటూ తపడ్డారు. కాళరాత్రి.. కాగడాల వెలుగుల్లో తలలపై వేలాది కర్రలు నాట్యం చేశాయి. పసుపు (బండారు) వర్ణంలో మల్లయోధుల్లా తలపడ్డారు. ఒకసారి దేవుడి రక్షకులైన భక్తులు తగ్గితే.. మరోసారి ఆ దేవుడిని సొంతం చేసుకోవాలనే గ్రామస్థులు తగ్గారు. కొట్టేవారు కొడుతున్నారు..

కిందపడ్డవారు లేచి మళ్లీ సమరానికి సిద్ధమయ్యారు. అర గంటకు పైగా అంటే 1:50 గంటల వరకు బన్ని ఉత్సవం సాగింది. ప్రతిటేటలాగే నెరిణికి, నెరిణికితండా, కొత్తపేట గ్రామస్థులే విజయం సాధించి.. ఉత్సమూర్తుల పల్లకితో జైత్ర యాత్ర సాగించారు. దట్టమైన అడవి ప్రాంతంలో ముళ్లపడ, పాదలకట్ట వద్దకు చేరుకొని పూజలు చేశా రు. అక్కడి నుంచి రాక్షసపడకు చేరుకొని శివుడి ఆజ్ఞానుసారం కంచెవీరబసవరాజు అనే గొరవయ్య 11 మూరల దారం కాలుపక్కి రంధ్రంలో నుంచి తీసి రాక్షసుడికి రక్తార్పణం చేశాడు. అక్కడి నుంచి ఉద యం 6:15 గంటలకు ఎదురు బసవన్న గుడికి చేరు కున్నారు. ప్రధాన అర్చకులు గిరిమల్లయ్య స్వామి భవిష్యవాణి (కార్ణీకం) వల్లించిన తరువాత ఉత్సవ మూర్తుల పల్లకిని సింహాసనం కట్టపైకి చేర్చి హారతి ఇవ్వడంతో బన్ని జైత్రయాత్ర ముగిసింది. సోమ వారం స్వామివారి రథోత్సవం జరుగుతుంది.



ఆసుపత్రిలో క్షతగాత్రులు

దేవరగట్టుపై ఎస్పీ బిందు మాధవ్

పగిలిన తలలు.. చిందిన రక్తం

దేవరగట్టు బన్ని ఉత్సవంలో కర్రలే పట్టు సాధించాయి. ఎలాగైనా కర్రలు లేకుండా ఉత్సవాలు జరపాలని నెల రోజుల నుంచి కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కఠిన చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. అంతేకాదు కొండపైకి చేరుకునే దారుల్లో ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసి జనం చేతుల్లో కర్రలు తీసుకున్నారు. పోలీసులు ప్రయత్నాలు చివరికి విఫలం కాకతప్పలేదు. ఆచారం మాటున సాగిన ఆటవిక సమరంలో తలలు పగిలి రక్తం చిందింది. 80 మందికి గాయపడగా.. స్థానికంగా ప్రభుత్వం వైద్య శిబిరంలో చికిత్స అందించగా.. తీవ్ర గాయాలైన 18 మందిని ఆలూరు, ఆదోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చిన్నచిన్న గాయాలకు స్వామి బండారు పూసుకున్నారు. ఈ ఉత్సవాలను ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షించారు. గుంతకల్లు, ఆలూరు ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, విరూపాక్షి, టీడీపీ ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, డీఎస్పీ వెంకటరామయ్య పర్యవేక్షించారు.

దేవరగట్టులో భవిష్యవాణి



భవిష్యవాణి (కార్ణీకం) చెప్పిన పూజారి గిరి మల్లయ్య స్వామి

దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని జైత్రయాత్రలో కీలక ఘట్టం భవిష్యవాణి (కార్ణీకం). బన్నీ జైత్రయాత్ర ఊరేగింపు అనం తరం ఆదివారం ఉదయం 6:15 నిమిషాలకు ఎదురు బసవన్న గుడి వద్ద పూజారి గిరి మల్లయ్య స్వామి భవిష్య వాణి వినిపించారు. దేవర గట్టులో చెప్పే భవిష్యవాణిపై రైతులకు ఎంతో నమ్మకం. పూజారి గోపరాక్ అనడంతో ఒక్కసారిగా భక్తులు నిశ్శబ్దాన్ని పాటించారు. కన్నడ భాషలో మాట్లాడుతూ

- పార్వతీదేవి దేశక్కే మల్లిగే హంగ్గాలే (పార్వతీ దేవి దేశంపై మల్లెపూలు చల్లింది)
- శక్తి ధ్యాన మాడబెకు (శక్తి స్వరూపిణి అమ్మవారిని ధ్యానించాలి)
- గంగి హోలేదండిగే నింతు భరతాళ్లే (గంగమ్మ నది ఒడ్డున నిలిచి వస్తుంది.)

వర్షాలు అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా కురుస్తాయి.

- క్వింటాళ్ల 6. 700/- నగెహళ్లె (పత్తి)
- క్వింటాళ్ల 3400 /-జ్వాళ (జొన్నలు)
- 3-6-6-3 మూడు ఆరు అవుతుంది. ఆరు మూడవుతుంది. వాణిజ్య పంటల ధరలు పెరిగి, తగ్గు ముఖం పట్టవచ్చన్నారు. రైతులు సంతోషంతో ఉంటారన్నారు.

అందరి సహకారంతో విజయవంతం : ఎస్పీ



అందరి సహకారంతో దేవరగట్టు బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. దేవరగట్టు ఉత్సవాల అనంతరం ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో కొందరికి చిన్నచిన్న గాయాలు తప్ప, ప్రాణాపాయం జరగలేదన్నారు. ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడిన వారిపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తనాభివృద్ధి పరిశ్రమలపై దృష్టి సారిస్తా

రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 13: ఉమ్మడి కర్నూలు జిల్లాలో విత్తనాభివృద్ధి పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గంలోని వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని ఆయన నివాసంలో సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయన్నారు.

మంత్రాలయం వద్ద తుంగభద్ర పరవళ్లు

310.500 మీటర్ల నీటి మట్టం



మంత్రాలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

మంత్రాలయం, అక్టోబరు 13: ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆదివారం సాయంత్రం మంత్రాలయం వద్ద 310.500 మీటర్ల నీటి మట్టంతో 88వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. టీబీ డ్యాం నుంచి 82వేల క్యూసెక్కుల నీరు నదికి విడుదల చేశారు. డ్యాంలోకి 90వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో తుంగభద్ర నది రెండు వైపులా సరిహద్దులను తాకుతూ పరవళ్లు తొక్కుతోంది. దర్శనార్థం వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నదితీర గ్రామాల ప్రజలను తాహసీల్దారు రవి, సీడబ్ల్యూసీ, పోలీసు అధికారులు గ్రామాల్లో దండోరా వేయిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, అక్టోబరు 13: పట్టణంలోని రాఘవేంద్రపురానికి చెందిన జంగం సోముశేఖర్(27) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ కోదండ రామిరెడ్డి తెలిపిన మేరకు.. మృతుడు మంత్రాలయం ఓ హోటల్లో పనిచేసేవాడు. భార్యను శనివారం ఉదయం పండుగ నిమిత్తం అదే కాలనీలో ఉంటున్న అత్తమామల ఇంటికి పంపించాడు. రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతూ కర్నూలు, ఆదోని, రాయచూరు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గక పోవడంతో శనివారం రాత్రి తన కొట్టంలో చీరతో ఉరివేసుకున్నాడు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య స్వర్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు. కాగా మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడు నెలల బాలింతగా ఉన్న భార్య, పిల్లలతో భర్త మృతదేహంపై పడి రోధిస్తున్న దృశ్యం కంటతడి పెట్టించింది.

అశ్వాల పార్వేట

- యామన్ననగరి రాజుల విజయం
- శభాష్ అనిపించుకున్న జగదిల్ రాయుడు



యామన్ననగరి అశ్వంపై జగదీల్ రాయుడు



అశ్వాలపారువేట తిలకిస్తున్న ప్రజలు

మద్దికెర, అక్టోబరు 13: విజయదశమి రోజున నిర్వహించే అశ్వాల పార్వేటలో యామన్ననగిరి రాజులు విజయం సాధించారు. మద్దికెరలో పెద్దనగిరి, చిన్ననగరి, యామన్న నగరి, యాదవరాజ వంశీకులు ఆదివారం అశ్వాల పార్వేటలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్న దసరా ఉత్సవాల్లో వారు పాల్గొన్నారు. అశ్వాలను ఉదయం గ్రామ శివారులోని భోజప్పబావికి తీసుకెళ్లి శుభ్రం చేసి తీసుకువచ్చారు. సాయంత్రం పెద్దనగరి, చిన్ననగరి, యామన్ననగరి యాదవరాజులు రాజుల దుస్తులతో తలకు తలపాగా, చేతికి ఖడ్గం ధరించి అశ్వాలు, సైన్యంతో మేళతాళాలతో బయలుదేరారు. మద్దికెరకు మజరా గ్రామమైన బొజ్జనాయునిపేటలో యాదవరాజులు నిర్మించుకున్న భోగేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లి ఈ మూడు కుటుంబాల వారు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం 4 కి.మీలు అశ్వాల పార్వేట పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో యామన్ననగరికి చెందిన జగదిల్‌రాయుడు మొదటి స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో పెద్దనగరి, తృతీయ స్థానంలో చిన్ననగిరికి చెందినవారు నిలిచారు. తరతరాలుగా వస్తున్న అశ్వాల పార్వేటను గ్రామ ప్రజలే కాకుండా ఇతర గ్రామాల నుంచి కూడ వచ్చి ప్రజలు ఆసక్తిగా తిలకించారు. గెలుపొందిన అశ్వంపై రాజులను మెయిన్‌బజారులో ఊరేగించారు.

సేవ ముసుగులో దగా..

- ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.1.50 లక్షలు
- స్వచ్ఛంద సంస్థ నిర్వాకం

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 13: ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిరుద్యోగులకు రూ.15 వేల జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.1.5 లక్షల చొప్పున వసూలు చేసింది. ఆగస్టు 7న బుద్ధ యోగా ఫౌండేషన్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి పాఠశాలలో పని చేయాలని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆదేశించారు. ఉత్తర్వులు తీసుకుని ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళితే.. తమకు జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని వారు చెప్పడంతో ఉత్తర్వులు అందుకున్న నిరుద్యోగులు తెల్లమొఖం వేశారు.

ఇలా మోసం...: బుద్ధ యోగా ఫౌండేషన్ గుంటూరును కేంద్రం చేసుకుని పని చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో యోగా, పీఈటీ, కంప్యూటర్ ఆపరేటర్, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ ఉద్యోగాలకు నెలకు రూ.15వేలు చెల్లిస్తున్నట్లు సోషల్ మీడియాలోనూ, పీఆర్వోలను పెట్టి భారీగా ప్రచారం చేశారు. ఇందులో పరోక్షంగా జిల్లా విద్యాశాఖ ఉద్యోగులు, అధికారులు కూడా ఈ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులకు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉద్యోగాలలో చేరేందుకు యువత భారీగా పోటీ పడ్డారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఒక్కో నిరుద్యోగ యువత నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసి, ఆగస్టు నెలలో వలంటీర్ యోగా, పీఈటీ, కంప్యూటర్ ఆపరేటర్, అకడమిక్ ఇయర్-24 వివిధ ఉద్యోగాల పేరుతో అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చి పాఠశాలలో విధుల్లో చేరాలని చెప్పారు. తీరా ఆర్డర్‌తో అక్కడికి వెళితే తమకు డీఈవో కార్యాలయం నుంచి ఉత్తర్వులు రాలేదని పాఠశాలల హెచ్‌ఎంలు తిప్పి పంపించారు. అభ్యర్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేసుకున్న కో ఆర్డినేటర్ వల్లి మొబైల్ ఫోన్ ఔట్ ఆఫ్ నెట్‌వర్క్ అని సమాధానం రావడంతో నిరుద్యోగులు అయోమయంలో పడ్డారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం, జిల్లా సమగ్రశిక్ష ఆఫీసు చుట్టూ మోసపోయిన యువత తిరుగుతున్నా పట్టించుకొనేవారు లేరు. గూడూరు మండలంలోని గూడూరు, పాలకుర్తి, చనుగొండ్ల, బెళగల్ హైస్కూల్‌లో నియామకాలు వచ్చిన వారు జిల్లా సమగ్ర శిక్ష ఆఫీసుకు వచ్చి అడిగితే అలాంటి నియామకాలేవీ లేవని, ఎలాంటి గౌరవ వేతనం ఇవ్వరని తెగేసి చెప్పడంతో తెల్ల మొఖాలు వేశారు. మోసపోయిన తమకు స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధుల నుంచి తిరిగి డబ్బులు ఇప్పించాలని గూడూరు మండలంలోని వడ్ల అరవింద్, దస్తగిరి, శ్రీరాములు అధికారులను కోరారు.

భార్యను హత్య చేసిన మద్యం బానిస



హత్యకు గురైన కృష్ణవేణి

గోనెగండ్ల, అక్టోబరు 13: దసరా కర్రీ పండుగ రోజు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని భార్యను కొట్టి చంపాడు ఓ భర్త. ఈ దారుణ ఘటన గోనెగండ్ల మండలంలోని కులుమాల గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కురువ పక్కీరప్పకు కోడుమూరు మండలం అనుకొండ గ్రామానికి చెందిన కృష్ణవేణితో ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే వారు. కొంత కాలంగా పక్కీరప్ప మద్యానికి బానిసై పనులు మానేసి జులాయిగా తిరిగేవాడు. అయితే కుటుంబ భారమంతా కృష్ణవేణి చూసుకునేది. నిత్యం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భర్త బాధపెట్టేవాడు. ఆదివారం ఇద్దరు పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి దసరా కర్రీ పండుగా కావడంతో మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్య కృష్ణవేణితో పక్కీరప్ప గొడవపడ్డాడు. అయితే తన దగ్గర డబ్బులు లేదని భార్య ఎంత చెప్పినా వినిపించుకోలేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవ తారాస్థాయికి చేరింది. పక్కనే ఉన్న రాతితో కృష్ణవేణి తలపై కొట్టి కిందకు తోసివేశాడు. రాతి దెబ్బకు తల పగిలింది. తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో కృష్ణవేణి మృతి చెందింది. మృతురాలి తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

గాలేరు నగరి కాల్వలో గల్లంతైన బాలుడు మృతి

బనగానపల్లె, అక్టోబరు13: మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన 12 ఏళ్ల వయస్సుగల మధురుచి అనే బాలుడు ఈనెల 8వతేదీన ప్రమాదవశాత్తు గాలేరు నగరి కాల్వలోపడి గల్లంతయ్యాడు. బాలుడి మృతదేహం ఆదివారం అవుకు చెర్వులో లభ్యమైంది. మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాలుడి తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బనగానపల్లె పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుగంగలో పడి యువకుడు గల్లంతు



గౌతమ్(ఫైల్)

మహానంది, అక్టోబరు 13: సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారడంతో తెలుగుగంగ ప్రధాన కాల్వలో యువకుడు పడిపోగా, రక్షించేందుకు దూకిన మరో యువకుడు గల్లంతు అయ్యాడు. ఈ ఘటన మహానంది సమీపంలో శనివారం చోట చేసుకుంది. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. వైఎస్‌ఆర్ జిల్లా బద్వేలుకు చెందిన మహేశ్, సురసుర గౌతం బావాబామ్మర్దులు. మహానందిలో జరిగే బంధువులు వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మహానంది సమీపంలోకి రాగానే తెలుగుగంగ ప్రధాన కాల్వ వద్ద ఇరువురు సెల్ఫీ తీసుకునేందుకు వాహనాన్ని పక్కకు నిలిపారు. కాల్వ అంచున నిలబడి మహేశ్ సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాల్వలో పడ్డాడు. గమనించిన గౌతమ్, మహేశ్‌ను కాపాడేందుకు కాల్వలోకి దూకాడు. అయితే మహేష్ కాల్వ ఒడ్డుకు చేరుకొని చెట్ల సహాయంతో బయటపడ్డాడు. కానీ గౌతం మాత్రం నీటి ప్రవాహానికి కాల్వలో కనిపించకుండా పోయాడు. గౌతమ్ తల్లి మహాలక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. నీటి ప్రవాహానికి కొట్టుకొని పోయిన గౌతమ్ ఆచూకీ కోసం తెలుగుగంగ ప్రధానకాల్వ వెంట సిబ్బంది అన్వేషించినట్లు తెలిపారు.


'నర్సింగ్ ఎన్నికల్లో ఒక వర్గానికే ప్రాధాన్యం'

కర్నూలు(హస్పిటల్), అక్టోబరు 13: ఏపీ గవర్నమెంటు నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియలో ఒక వర్గానికి అధికారులు కొమ్ము కాస్తున్నారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ వేసే అభ్యర్థి ఇద్దరు ప్రతిపాదికులను తీసుకరావాలి. ఎన్నికలను నిష్పక్షపాతంగా అధికారులు నిర్వహించాల్సి ఉండగా.. ఒక ప్యానల్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపకపోతే రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని కొందరు అంటున్నారు. ఈ విషయంపై కర్నూలు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 విమలమ్మను వివరణ అడుగగా తాము ఎవరికీ అనుకూలంగా వ్యవహరించడం లేదని అన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆస్పరి, అక్టోబరు 13 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆస్పరి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేశ్వరమ్మ, భీమేష్ దంపతులు. వీరికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నాయి. అయితే భీమేష్ ఆరు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడు తల్లికి చేదోడుగా వాదోడుగా ఉండేవాడు. కొద్దిరోజుల క్రితం విష జ్వరం బారిన పడిన శివకుమార్(17)ను వైద్యం కోసం ఆదోనికి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. శివకుమార్ మరణ వార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అబ్బుర పరచిన విన్యాసాలు



ఇనుప చువ్వలను గుచ్చుకొని రెండు పైపులపై ఉన్న బండి చక్రాన్ని లాగుతున్న యువకులు





వీపునకు ఇనుప చువ్వలను గుచ్చుకొని విన్యాసాలు చేస్తున్న దృశ్యాలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 13: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో యువకులు చేసిన విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. ప్రతియేటా దసరా పండుగా సందర్భంగా దసరారోజు, మరుసటి రోజు గ్రామంలోని యువకులు విన్యాసాలు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈ ఏడాది సైతం గ్రామంలో ఉన్న గచ్చిన గల్లీ, చింతమాను గల్లీ, రామమ్మవ్వ గల్లీల యువకులు విన్యాసాలు చేశారు. ముందుగా ఆయుధ పూజ చేసి పులి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామపెద్ద వై.రుద్రగౌడు ఇంటి ముందు విన్యాసాలు చేశారు. యువకులు వీపునకు ఇనుప చువ్వలను గుచ్చుకొని గాలిలో వేలాడడం, అలాగే రెండు పైపులపై బండి చక్రాన్ని ఒకచోటు నుంచి మరొక చోటుకు లాగే దృశ్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. యువకులు చేసిన కర్రసాము, కర్రపై దూకడం, నేలపైనే పల్టీలు కొట్టడం వంటి విన్యాసాలను చూసి వీలలు వేశారు. ఈ దృశ్యాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు.

రతన్‌టాటాకు భారతరత్న అవార్డు ఇవ్వాలి

● టీడీపీ సీనియర్ నాయకులు కేఈ వేమన్నగౌడ్



రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేఈ వేమన్నగౌడ్ తదితరులు

కర్నూలు(రూరల్), అక్టోబరు 13: రతన్‌టాటాకు భారతరత్న అవార్డు ఇవ్వాలని టీడీపీ సీనియర్ నాయకులు, వేగం గ్రూపు కంపెనీ ఛైర్మన్ కేఈ వేమన్నగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బిర్లాగేట్‌లోని ఆయన తన కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు. వేమన్నగౌడ్ మాట్లాడుతూ భరతమాత ముద్దు బిడ్డగా దేశం గర్వించే స్థాయికి ఎదిగిన రతన్‌టాటా అందరికి ఆదర్శప్రాయమన్నారు. కరోనా సమయంలో తనవంతు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. దేశం ఎల్లపుడు భావితరాలు గుర్తుంచుకోవాలంటే రతన్‌టాటాకు భారతరత్న అవార్డు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రి సంబంధించిన ఇంటెర్ వెన్సిలన్ రేడియాలజిస్టు వైద్యనిపుణులు డా.విజయకుమార్‌గౌడ్, టీడీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, రమణ, జమీల్‌భాష, రామాంజనేయులు, తులసీ తదితరలు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎస్వీ దంపతులు

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 13: దసరా పండుగను పురస్కరించుకుని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ విజయమనోహరి దంపతులు నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం జమ్మిచెట్టును దర్శించుకోవడంతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 13: కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసి ప్రొఫెసర్ సాయిబాబ మృతికి సంతాపం ప్రకటిస్తున్నట్లు ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామంజనేయులు ఆదివారం తెలిపారు. అణగారిన వర్గాలు, మానవ హక్కులను కాపాడం కోసం రాజ్యహింసను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ అమానుష నిర్బంధానికి గురై సుదీర్ఘకాలం అనారోగ్యంతో సాయిబాబా కన్నుమూశారని ఆయన పేర్కొన్నారు.

● ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబ మృతి అణగారిన వర్గాల ప్రజలకు తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు.

ఘనంగా పాస్టర్ డే

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 13: జీసెస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కర్నూలులో పాస్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ క్రైస్తవ మత గురువులకు పాస్టర్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. టీజీ వెంకటేశ్ స్వగృహంలో జీసెస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. సమాజంలో శాంతిని పెంపొందించే బాధ్యత పాస్టర్లపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ జి.రవికుమార్, ఆర్.ప్రసాదరావు, పుష్పరాజ్, ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

నగరంలో 'పొట్టేల్' చిత్రబృందం సందడి



కొండారెడ్డి బురుజు వద్ద పొట్టేల్ చిత్ర బృందం

కర్నూలు (కల్చరల్), అక్టోబరు 13: కర్నూలు నగరంలో ఇటీవల రూపొందించిన 'పొట్టేల్' సినిమా చిత్రబృందం సందడి చేసింది. ఈ నెల 25వ తేదీ సినిమా విడుదలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలో భాగంగా కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఈ సినిమాలోని హీరో యువచంద్రకృష్ణ పొట్టేల్ పట్టుకుని అలరించారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడే కష్టం ఈ సినిమాలో చూపించామని హీరో తెలిపారు. యువతకు కావాల్సిన అన్ని అంశాలను సినిమాలో దర్శకుడు సాహిత్ చక్కగా చిత్రీకరించారని ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రేక్షకులు తమ చిత్రాన్ని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి: ఎస్ఐ

సి.బెళగల్, అక్టోబరు 13: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ తిమ్మారెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.



పూజలందుకుంటున్న అమ్మవారు



తుంగభద్రలో నిమజ్జనం చేసేందుకు అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు



ఘనంగా దుర్గామాత నిమజ్జనం

● విగ్రహాలకు పూజలు చేసిన మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్
● భక్తులతో కిక్కిరిసిన తుంగభద్ర తీరం

కర్నూలు (కల్చరల్), అక్టోబరు 13: దసరా మహోత్సవంలో భాగంగా దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని కర్నూలు నగరంలో తొమ్మిది రోజులుగా నెలకొల్పిన దుర్గామాత విగ్రహాలు భక్తులతో విశేష పూజలందుకుని ఆదివారం రాత్రి గంగమ్మ ఒడికి చేరాయి. ఉత్సవాలు ఆదివారం నగరంలో కన్నుల పండువగా సాగాయి. టీజీవీ గ్రూప్స్ ఆధ్వర్యంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసి దుర్గామాత మట్టి విగ్రహాలు ఒక్కొక్కటిగా తుంగభద్ర నది తీరానికి తరలివచ్చాయి. ఈ వేడుకను తిలకించేందుకు విచ్చేసిన వేలాది భక్తులతో నగరంలోని సంకల్‌బాగ్‌లో గల తుంగభద్ర నది తీరం కిక్కిరిసిపోయింది. వేద పండితులు శాస్త్రోక్తంగా దుర్గామాత విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన ఉత్సవ వేడుకలను రాష్ట్ర పరిశ్రమలు మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. మంత్రి టీజీ భరత్ స్వయంగా దుర్గామాత విగ్రహాన్ని శిరస్సుపై ఎత్తుకుని దుర్గాఘాట్ వరకు చేరుకున్నారు. అక్కడ పండితులు మరోసారి పూజలు చేసి నిమజ్జన ఉత్సవాన్ని ప్రారంభించారు.



అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న మంత్రి, మాజీ మంత్రి, తదితరులు



చిన్నారులతో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు తెలుగు శ్రీనివాసులు



హాళేనాపురంలో స్వామి అమ్మవార్ల పల్లకిని మోస్తున్న మల్లెల రాజశేఖర్



ఓర్వకల్లులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

● రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలి : మంత్రి టీజీ భరత్



రాష్ట్రంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ఆ దుర్గామాతను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వేడుకున్నారు. టీజీవీ గ్రూప్స్ ద్వారా దాదాపు రూ. ఐదు లక్షలతో 47 మట్టి దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. గణేష్ ఉత్సవాలకు కూడా మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలని, మట్టి విగ్రహాలు వాడడంలో కర్నూలు రాష్ట్రంలోనే నెంబర్‌వన్‌గా ఉండేలా చూడాలన్నారు. గత 22 ఏళ్లగా దుర్గామాతల నిమజ్జనం చేయడం రాష్ట్రంలో ఎక్కడా లేదని చెప్పారు.





● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ దుర్గామాత నిమజ్జన ఉత్సవాలు వచ్చే ఏడాది ఇంకా ఘనంగా నిర్వహించుకోవాలని ఎంపీ అన్నారు. జిల్లాలో దసరా శరన్నవరాత్రులు విజయవంతంగా జరిగాయని అన్నారు.



● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ నగరంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా నగరంలో ప్రతి సంవత్సరం దుర్గాదేవి మట్టి విగ్రహాల నిమజ్జనం వేడుకలు పండుగ వాతావరణంలో జరుగుతాయని కోరారు. దుర్గాదేవి మహిషాసురుడ్ని సంహరించిన విధానం చూస్తే దేవతలు దుష్టశక్తులను సంహరించేందుకు వచ్చినట్లు తెలుస్తుందన్నారు. ఓటు ప్రజల చేతిలో ఆయుధమని, దాన్ని సక్రమంగా వినియోగిస్తే మంచివారు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతారని లేకపోతే రాక్షసులు, ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతారని చెప్పారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతి ధర్మాలను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ బీవై రామయ్య, వీహెచ్‌పీ నాయకులు సాయిరెడ్డి, గోరంట్ల రమణ, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ పత్తి ఓబులయ్యను ఘనంగా సత్కరించారు.

ఓర్వకల్లు: మండలంలోని హాశేనాపురం గ్రామంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆదివారం మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. మేళతాళాలతో, బాజా భజంత్రీలతో ఆలయం చుట్టూ గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి కాల్వబుగ్గ మినీ రిజర్వాయరులో నిమజ్జనం చేశారు.

● మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, లొద్దిపల్లె, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, హుశేనాపురం, శకునాల, తదితర గ్రామాల్లో ఉగాది వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. హుశేనాపురం గ్రామంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కాల్వబుగ్గ మాజీ ఛైర్మన్ చంద్రపెద్దస్వామిలు జమ్మిచెట్టుకు పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

సి. బెళగల్ మండలంలో దసరా వేడుకలు ఘనంగా ప్రజలు జరుపుకున్నారు. గ్రామాలలో స్వాముల వారిని గ్రామ పుర వీధులలో బ్యాండు భజంత్రీలతో పల్లకిలో ఊరేగింపు చేశారు. అనంతరం సాయింత్రం జమ్మిచెట్టు కెళ్లి జమ్మి పత్రితో దేవుళ్ళకు పూజలు చేసి పెద్దలకు జమ్మి పత్రి పెట్టి పాదనమస్కారాలు చేసుకుని పిల్లలు పెద్దల ఆశీస్సులు పొందారు.

గూడూరు: కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో అంభా భవానీ మాత ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు.

కోడుమూరు (రూరల్): మండలంలోని అన్ని గ్రామాలలో దసరా పర్వదిన వేడుకలను ఘనంగా చేపట్టారు. గోరంట్ల, వర్కూరు గ్రామాల్లో లక్ష్మీమాధవ స్వామి పల్లకి ఊరేగింపు జరిపించారు.



విగ్రహాల తరలింపు



కోడుమూరురూరల్: వర్కూరులో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు



కర్నూలులో.. రావణ దహనం చేస్తున్న దృశ్యం



వాసవి నగర్‌లో వివిధ వేషధారణలతో దుర్గామాత విగ్రహాల ఊరేగింపు







జొహరాపురం జమ్మిచెట్టు వద్ద భక్తుల సందడి



వేడుకలకు హాజరైన ప్రముఖులు



కళాకారులతో మంత్రి, ఎమ్మెల్యే

సాయిబాబా ఆశయాలను కొనసాగించాలి



మానవ హక్కుల నేత దివంగత ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు (కల్చరల్), అక్టోబరు 13: మానవహక్కుల నేత, దివంగత ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందరూ ఇచ్చే నిజమైన నివాళి అని పలువురు ప్రజాసంఘాల నాయకులు అన్నారు. శనివారం హైదరాబాదులో మరణించిన మానవ హక్కుల నేత సాయిబాబా సంతాప సభ ఆదివారం నగరంలోని ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో నిర్వహించారు. విరసం బాధ్యుడు పాణి అధ్యక్షత వహించిన ఈ సంతాప సభలో వివిధ సంఘాల బాధ్యులు పాల్గొని ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాణి మాట్లాడుతూ సాయిబాబా అరుదైన వ్యక్తిత్వం గల ప్రజామేధావి అని కొనియాడారు. రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా మరణం రాజ్యం చేసిన హత్యయని పదేళ్ల జైలు నిర్బంధంలో కనీస వైద్య సహాయం అందించకుండా ఆయన మృతికి కారణమయిందని, బుద్ధి జీవులు, ప్రజలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన విధానాలను ప్రశ్నించే వారిని మావోయిస్టులుగా ముద్ర వేస్తూ వేధింపులకు గురి చేస్తున్నదని ప్రజల పక్షం వహించిన మేధావుల గొంతుకలు నొక్కివేస్తుందని, 90 శాతం అంగవైకల్యం కలిగి ప్రొ.సాయిబాబా మొక్కవోని ధైర్యంతో ప్రజల హక్కుల కోసం పని చేశారన్నారు. సంతాప సభలో కుల నిర్మూలనా పోరాట సమితి బాధ్యుడు సుబ్బరాయుడు, పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజాసాగర్, డీటీఎఫ్ బాధ్యుడు రత్నం ఏసేపు, పోస్టల్ యూనియన్ నాయకులు మల్లేశ్వరరెడ్డి, బుడగ జంగాల సంక్షేమ సంఘం నాయకుడు తూర్పాటి మనోహర్, లక్ష్మీకాంత్ నివాళులర్పించారు.

విచ్చలవిడిగా ఎర్రమట్టి తవ్వకాలు

సి. బెళగల్, అక్టోబరు 13: మండల కేంద్రంలో రాత్రి వేళల్లో ఎర్రమట్టిని విచ్చలవిడిగా తరలిస్తున్నా రెవెన్యూ, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొండాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థానిక నాయకుల, పోలీస్ అధికారుల అండతోనే ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే మండలంలోని సంగాల, తిమ్మనదొడ్డి, పోలకల్లు, క్రిష్ణదొడ్డి, బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడి, చింతమానుపల్లె గ్రామాలలో ఉన్న ఎర్రమట్టి కొండలను వైసీపీ నాయకులు తవ్వుతున్న మండల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు రాముడు, వెంకటేశ్వర్లు, లింగన్న రామక్క, సోమిరెడ్డి, రామకృష్ణరెడ్డి ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

మాళ మల్లేశ్వర స్వామి కల్యాణం


కల్యాణం చేస్తున్న అర్చకులు

ఆలూరు, అక్టోబరు 13: దేవరగట్టు మాలమళ్ళేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి మల్లేశ్వర కల్యాణం నిర్వహించారు. అర్చకులు పూజలు, వేదమంత్రాలు చెబుతూ కల్యాణం చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏడీఏ

గోనెగండ్ల, అక్టోబరు 13: ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశముందని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. వరి పొలంలో నీరు నిలవకుండా చూసుకోవాలని, వర్షం తగ్గిన అనంతరమే ఎరువులు పిచికారీ చేయాలన్నారు. వేరుశనగ కోత పూర్తయితే కాయలు తడవ కుండా టార్పాలిన్లతో కప్పాలని కోరారు. కంది పూత దశలో ఉందని, వర్షపునీటిని బయటకు పంపేలా జాగ్రత్త వహించాలని, లేకపోతే తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు.

'సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి'


మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 13: నియోజగవర్గ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మాధవ రంలో మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు పల్లెపండుగలో భాగంగా రూ.9.56కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభిస్తామ న్నారు. రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రాకేష్‌రెడ్డి, రామకృష్ణ, బొజ్జప్ప, చాకలి రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరసింహులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత


మరమ్మతులు చేస్తున్న నాయకులు

గోనెగండ్ల, అక్టోబరు 13: ఎమ్మిగనూరు, కోడుమూరు రహదారిలోని వేముగోడు గ్రామ సమీపంలో రోడుపై గుంతలను టీడీపీ నాయకులు ఆదివారం పూడ్చివేశారు. ఈ రహదారిపై శనివారం కారు బోల్తాపడటంతో తాత్కాలిక మరమ్మతులు చేసినట్లు రాజు, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర తెలిపారు. అధికారులు రహదారి వేయాలని కోరారు.

నేడు 'పల్లె పండుగ'కు కలెక్టర్ రాక

దేవనకొండ ,అక్టోబరు 13: మండల కేంద్రంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమానికి కలెక్టర్ రంజిత్ బాషా రానున్నట్లు ఈవోఆర్డీ సూర్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే విరుపాక్షి, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ పాల్గొంటారని, అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు.
మద్దికెర: మండలంలో సోమవారం నుంచి 19వ తేదీ వరకు పల్లె పండుగ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొండయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. 14న బసినపల్లి, 15న బొమ్మనపల్లి, 16న ఎడవలి, 17న బురుజుల, 18న హంప, 19న, పెరవలి, ఎం.అగ్రహారం, మద్దికెర గ్రామాల్లో ఉంటుందని తెలిపారు.


పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు


కళాకారుల నృత్య ప్రదర్శన


మంత్రాలయం: మాధవరంలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు


గోనెగండ్ల: పెద్దనేలటూరులో విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

- ఆదోనిలో రావణ దహనం
- మంత్రాలయంలో పూజలు, నిమజ్జనం

ఆదోని, అక్టోబరు 13: విజయదశమి సందర్భంగా చిన్న శక్తిగుడి ఆవరణలో శనివారం రావణ దహనం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు, భూపాల్ చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. 20 అడుగుల ఎత్తైన రావణ, కుంభకర్ణుల విగ్రహాలకు రాకెట్ బాణంతో నిప్పంటించి దహనం చేశారు. అలాగే మున్సిపల్ మైదానంలో ఎమ్మెల్యే పార్థసారథి 25 అడుగుల ఎత్తయిన రావణ, కుంభకర్ణుల విగ్రహాలను దహనం చేశారు. భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలను వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పిల్లలకు ఎమ్మెల్యే పార్థసారథి జ్ఞాపికలు అందజేశారు. టూటౌన్ సీఐ సూర్య మోహన్ రావు బందోబస్తు ఏర్పాటు చేశారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, విట్టా రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణమూర్తి, బసవరాజ్ స్వామి, నీలకంఠప్ప పాల్గొన్నారు.
మంత్రాలయం: మఠంతో పాటు మాధవరం, రచ్చుమర్రి, మాలపల్లి, చెట్నహళ్లి, చిలకలడోణ, కల్లుదేవకుంట, సూగూరు, రాంపురం గ్రామాల్లో విజయదశమి వేడుకలు నిర్వహించారు. శని, ఆదివారాలు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జమ్మి చెట్టుకు పూజలు చేసి హారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించారు. కన్యకాపరమేశ్వరి, గంగాభవానీ విగ్రహాలను నదిలో నిమజ్జనం చేశారు.
పత్తికొండ టౌన్: పట్టణంలో శనివారం దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు చేయడంతో ఉత్సవాలు ఘనంగా ముగిసాయి.
గోనెగండ్ల: మండల కేంద్రమైంతో గ్రామాల్లో శనివారం విజయదశమి వేడుకలు నిర్వహించుకున్నారు. గోనెగండ్ల, పెద్దనేలటూరు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం దుర్గాదేవి విగ్రహాలను ఊరేగించి, అనంతరం గాజులదిన్నె ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. గ్రామపెద్దలు గ్రామ శివార్లలోని శమీ వృక్షం వద్దకు విగ్రహాలను ఊరేగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి నీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పెద్దలచేత యువకులు, మహిళలు, పిల్లలు దీవెనలు అందుకున్నారు. అలువాల, హెచ్ కైరవాడి, కులుమాల, పెద్దమరివీడు, చిన్నమరివీడు, అగ్రహారం, గంజహళ్లి, బైలుప్పల, వేముగోడు, పుట్టపాశం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో వేడుకలు చేసుకున్నారు.
పెద్దకడుబూరు: మండలంలో దసరా పండుగ జరుపుకున్నారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.
దేవనకొండ: నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తెర్నెకల్, దేవనకొండ, కప్పట్రాళ్ల, పి.కోటకొండలో విగ్రహాలను ఊరేగించారు.
తుగ్గలి: తుగ్గలి, జొన్నగిరి గ్రామాల్లో విగ్రహాలకు పూజలు చేశారు. యువకులు పారువేట, సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు చేసుకున్నారు.
కోసిగి: ఆర్లబండ గ్రామం అంబా భవానిని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, కౌతాళం టీడీపీ మండల కన్వీనర్ ఉలిగయ్య, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ దర్శించుకున్నారు. పీఠాధిపతి మఠస్వామి ఆశీర్వాదం పొందారు. నర్సారెడ్డి, మజ్జిగ అయ్యప్ప, వీరయ్య, సర్పంచ్ మల్లికార్జున, మాలపల్లి లక్ష్మన్న, రంగారెడ్డి, గుండేష్, తిమ్మప్ప, తిక్కయ్య, గోవిందు, అయ్యన్న, సాతనూరు కోసిగయ్య ఉన్నారు.
మద్దికెర: మద్దికెర. పెరవలి రంగనాథ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.


ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి

క్రైస్తవులకు అండగా ఉంటా

ఆదోని, అక్టోబరు 13: క్రైస్తవులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పార్థ సారథి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీ చర్చిలో ప్రార్థనలో పాలొన్నారు. రోజుకు 15 గంటలు పనిచేస్తున్నానని, ఒత్తిడి తగ్గించుకోడానికి దైవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. పాస్టర్లు, క్రైస్తవులంతా సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. సమస్యలుంటే తనను నేరుగా కలవాలని పరిష్కరిస్తానన్నారు.


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న కాటన్ మర్చెంట్స్

వరద బాధితులకు రూ.3.20లక్షలు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 13: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదోని కాటన్ మర్చంట్ అసోసియేషన్ నాయకులు వెంకటరామిరెడ్డి లక్ష్మణరావు సూగురప్ప, మరియాని చెన్న బసప్ప రూ.3.20లక్షలను ఎమ్మెల్యే పార్థసారథికి అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు విట్టా రమేష్, జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, పట్టణ నాయకులు, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

దేవరగట్టు బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి


మాట్లాడుతున్న తిక్కా రెడ్డి, వీరభద్ర గౌడ్

ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కా రెడ్డి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. ఆదివారం దేవరగట్టులో విలేకర్ల మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఆలయం అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే ఏడాదికల్లా బీటీ రోడ్డు వస్తుందన్నారు. బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకున్నారని సహకరించిన కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్, ఆర్డీవో, పోలీసు, యంత్రాంగం అభినందనీయులని తెలిపారు.

బీరువా పగులగొట్టి చోరీ

కోసిగి, అక్టోబరు 13: స్థానిక 9వ వార్డు దుర్గానగర్ సమీపంలోని నరసన్న ఆచారి, అంబమ్మ దంపతులు రెండు నెలల క్రితం బెంగుళూరుకు వలస వెళ్లారు. ఇంటికితాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు రెండు రోజుల క్రితం తాళం పగులకొట్టి బీరువాలో రూ.65వేల నగదు, ఇంటి పత్రాలు అపహరించుకుని వెళ్లారని బాధితులు నరసన్న ఆచారి, అంబమ్మ తెలిపారు. బీరువాపైన రక్తంతో డేంజర్ అంటూ బెదిరింపు రాతలు రాశారని, కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ఎమ్మెల్యేల పూజలు

హొళగుంద/ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టులో ఆలూరు, గుంతకల్లు ఎమ్మెల్యేలు విరుపాక్షి, గుమ్మనూరు జయరాం వేర్వేరుగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దలు స్వాగతం పలికి సన్మానిం చారు. దేవరగట్టును పర్యాటక కేంద్రంగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శ్రీనివాసులు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

మద్దికెర, అక్టోబరు 13: మద్దమ్మ ఆలయ అభివృద్ధికి బోనాల కుమార్, శారద కుమారులు వీరేంద్ర కుమార్, విద్య, రాజశేఖర్, స్వాతి, విజయ్ కుమార్, కీర్తన, మద్దమ్మ రూ.2లక్షలను అందజేశారు. నిర్వాహకులు మాజీ ఎంపీపీ జమేదార్ నీలకంఠ రాయుడు సదాశివ పెండేకల్ మాజీ సర్పంచ్ వీరభద్రి జ్యోతి పాల్గొన్నారు.


విరాళం ఇస్తున్న దాతలు

నేడు మాళ మల్లేశ్వర స్వామి రథోత్సవం

హొళగుంద, అక్టోబరు 13 : రాష్ట్రలోనే ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలలో భాగంగా రథోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పూజారి గిరి మల్లయ్య స్వామి ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, రథ సంస్కారం, రథాంగ హోమం, బండారు అర్చన, మహామంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు, సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మాళ మల్లేశ్వర స్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని ఆలయ నిర్వాహకులు వివరించారు.


ఉత్సవానికి సిద్ధం చేస్తున్న రథం

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిన శ్రీమఠం ప్రాగంణం

మంత్రాలయం, అక్టోబరు 13: శ్రీమఠానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. విజయదశమి అనంతరం ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల భక్తులు రావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, నదీతీరం భక్తులతో కోలాహలంగా కనిపించింది. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద సందడిగా మారింది. ఏఏవో మాధవ శెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషి, సూపరింటెండెంట్ అనంత పురాణిక్ ప్రసాదం కొరత రానీయకండా కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే


వినతిపత్రాలు ఇచ్చేందుకు బారులు తీరిన ప్రజలు

ఎమ్మిగనూరు, అక్టోబరు13: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కుర్ని కమ్యూనిటీ హాల్‌లో ప్రజాదర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించారు. దాదాపు నాలుగు గంటలు, 350మందికి పైగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిలో కొన్ని.. పట్టణంలోని అబ్బాస్ టాకీస్ ప్రాంతానికి చెందిన చాంద్‌బాషా దంపతులు తమకు గతంలో పట్టా ఇచ్చి, ఇంతవరకు స్థలం చూపలేదని విన్నవించారు. అలాగే ఎద్దుల మార్కెట్ ప్రాంతంలో నివాసం ఉంటున్న బసవరాజు, సులోచన దంపతులు తమ కుమారుడు ఉదయ్ కిరణ్‌కు కిడ్నీ జబ్బుతో బాధపడుతున్నాడని వైద్యపరీక్షలకు రూ.8ల క్షలు అయిందని, సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పిం చాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినతిపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసి ప్రభుత్వ శాఖలకు పంపుతామన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్, మిఠాయి నరసింహులు, ముల్లా కలీముల్లా పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

గోనెగండ్ల, అక్టోబరు 13: మిత్రుడు మృతి చెందాడని తెలుసుకున్న 2000పదో తరగతి విద్యార్థులు బాధితకుటుంబానికి రూ.50వేల సాయం అందజేశారు. పెద్దమరివీడు గ్రామానికి చెందిన నబీరసూల్(40) వెలుగు కార్యాలయంలో బుక్‌కీపర్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. మిత్రులు షేక్షావలి, గానినబాషా, జిక్రియ, ఖాసీంసాహెబ్, కృష్ణ. రంగస్వామి, వీరేష్, రంగన్న, జనార్దన్, రామకృష్ణ. రసూల్, పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి ప్రభోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 13: మండలంలోని కందనాతి గ్రామ కొండపై వెలసిన చెన్నకేశవస్వామి ప్రభోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కొండపై వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి ప్రభోత్స వాన్ని కొండకింద కడివెళ్ల రహదారిలో ఉన్న జమ్మి చెట్టువరకు తెచ్చి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాలుగు గ్రామాల భక్తులు కొండపై ఉన్న చెన్నకేశవ స్వామి సన్నిధికి చేర్చారు. ప్రభోత్సవాన్ని తిరిగి కొండపై ఆలయానికి చేర్చేక్రమంలో నల్లగుండు సమీపంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. కందనాతికి చెందిన బోయ మల్లికార్జున, గుడిసె వినోద్, బోయ హరికృష్ణ, మాస్‌మాన్ దొడ్డి గ్రామానికి చెందిన భీమేష్, వెంకటగిరి గ్రామా నికి గొల్ల శంకర్, సోమన్న తల, చేతులకు గాయాలు కాగా, ఒకరిని ఆదోని ప్రభు త్వ వైద్యశాలకు మిగిలిన వారు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

చెన్నకేశ్వస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీవీ

కందనాతి గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామితో పాటు గ్రామదేవత మారెమ్మవ్వలను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండపై వెలసిన చెన్నకేశవస్వామిని దర్శించుకుని ప్రభోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు ఫల, పుష్ప, మంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు కురవడంతో పంటలు బాగా పండి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతియేటా దేవుడి ఆశీస్సులతో ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ కేశన్న, మాస్‌మాన్‌దొడ్డి బొజ్జప్ప, బోడబండ సురేష్‌చౌదరి, మహేంద్ర, రాఘవేంద్ర, హనుమంతు, రఘు లతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ సీఐ విక్రమ్‌సింహ, ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.


పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు